క్లుప్తంగా

పీబీవీ శ్రీరామ్మూర్తి మృతి తీరని లోటు



పీబీవీ శ్రీరామ్మూర్తి (ఫైల్)

విజయనగరం అర్బన్: ప్రముఖ కథా రచయిత పీబీవీ శ్రీరామ్మూర్తి మృతి తెలుగు సాహితీరంగానికి తీరని లోటని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. శ్రీరామ్మూర్తి మృతి విషయం తెలుసుకున్న డీవీజీ శంకరరావు సోమవారం పట్టణంలోని ఆయన స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే అరసం జిల్లా అధ్యక్షుడు జీఎస్ చలం, కార్యదర్శి ఆర్. బాలకృష్ణ, తదితరులు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

మూగజీవాలను సంరక్షించుకోవాలి

• జిల్లా పశుసంవర్థక శాఖాధికారి వైవీ రమణ



ముంజేరు పశు వైద్యశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా పశుసంవర్థక శాఖాధికారి వైవీ రమణ

భోగాపురం: ఎండాకాలంలో మూగజీవాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత పెంపకందారులపై ఉందని జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి వైవీ రమణ అన్నారు. భోగాపురం, ముంజేరు పశువైద్య కేంద్రాలను సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి వైద్యులు ఉమామహేశ్వరపాత్రో, రామరాజుకుల పలు సూచనలు చేశారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాములకు కల్యాణం జరిపిస్తున్న రుత్విక్కులు

విజయనగరం రూరల్: మండలంలోని సారిక పంచాయతీ పరిధిలోని రామనారాయణంలో పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని సీతారాముల కల్యాణం సోమవారం కనులపండువగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు హర్షశర్మ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణతో ఆరోగ్యం మెరుగు

నులి పురుగుల నివారణతో మెరుగైన ఆరోగ్యం సిద్ధిస్తుందని వైద్యులు, అధికారులు తెలిపారు. విజయనగరం, నెల్లిమర్ల నియోజకవర్గాల్లో సోమవారం డీ వార్మింగ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను అధికారులు, వైద్య సిబ్బంది సందర్శించి చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మరీ 19 ఏళ్ల లోపున్న చిన్నారులకు మాత్రలు పంపిణీ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



పూసపాటిరేగ: బాలికతో మాత్ర మింగిస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, తదితరులు



నెల్లిమర్ల: మాత్రలు వేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణరాజు



డెంకాడ: పెదతాడివాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలు వేస్తున్న డాక్టర్ భవాని

భూ ఆధార్ చేయించుకోవాలి

• ఏఓ నీలిమ



భూఆధార్ నమోదులో పాల్గొన్న మండల వ్యవసాయ అధికారి నీలిమ, తదితరులు

పూసపాటిరేగ: ప్రతి రైతూ భూ ఆధార్ తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ అన్నారు. మండలంలోని రెల్లివలసలో సోమవారం భూ ఆధార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ చేయుటకు కేంద్రప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య ఆధార్‌కార్డు తరహాలో కేటాయిస్తుందని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి రాయితీలు పొందాలంటే ఈ గుర్తింపు సంఖ్య తప్పనిసరని చెప్పారు. ప్రతి రైతూ పట్టాదారు పాసుపుస్తకం, వన్‌బీ, ఆధార్‌కార్డు, ఆధార్‌కు లింకు అయిన ఫోన్ తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

శివరాత్రి లోగా మరమ్మతులు చేపడతాం..

• ఆర్అండ్‌బీ ఏఈ నందకుమార్

సాక్షి ఎఫెక్ట్...

నెల్లిమర్ల రూరల్: రాబోయే శివరాత్రి జాతరకు రామతీర్థం జంక్షన్ నుంచి ఎంబే రేయగుళ్ల జంక్షన్ వరకు రహదారిపై ఉన్న గుంతలను పూడ్చేవిధంగా తాత్కాలిక మరమ్మతులు చేపడతామని ఆర్అండ్‌బీ ఏఈ నందకుమార్ తెలిపారు. రహదారి దుస్థితిపై సాక్షిలో సోమవారం 'కళ్లకు గంతలు తీసి గుంతలు కప్పండి' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రహదారి పనులు సీఆర్ఎఫ్ ప్రొగ్రాంలో ఉన్నాయని, కాంట్రాక్టర్‌కు బిల్లులు పూర్తిగా చెల్లించని కారణంగా ప్రస్తుతం పనులు నిలిపివేశారని తెలిపారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్నామని, త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



14న సత్య డిగ్రీ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్



క్యాంపస్ డ్రైవ్ బ్రోచర్లను విడుదల చేస్తున్న సీతం విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, తదితరులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఈ నెల 14న ఫార్మా కంపెనీల జాబ్ డ్రైవ్ పేరుతో పూల్ క్యాంపస్ ఎంపికలు చేపడుతున్నామని సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు తెలిపారు. కళాశాల ఆవరణలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. యోకోహోమ్ టైర్స్, పేటీఎం, రక్షిత్ గ్రూప్ ఆఫ్ ఫార్మా కంపెనీలు నిర్వహించనున్న ఎన్నికలకు డిప్లోమో, ఐటీఐ, బీఎస్సీ, బీకాం, బీఏ, బీఫార్మసీ, ఎం. ఫార్మసీ విద్యార్థులు అర్హులన్నారు. ఆరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే డ్రైవ్‌కు బయోడేటాతో పాటు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు తీసుకురావాలన్నారు. 70132 93316, 90327 72661, 99630 69332 నంబర్లకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి, తదితరులు పాల్గొన్నారు.

స్టెమీతో గుండెకు భరోసా..

నెల్లిమర్ల: గుండెపోటు రోగులకు స్టెమి ఇంజిక్షన్ ఎంతో మేలు చేస్తుందని స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ వినోద్‌కుమార్ లాల్వానీ అన్నారు. సోమవారం స్థానిక ఆరోగ్య కేంద్రంలో స్టెమి ఇంజిక్షన్‌కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చిన వారిని గంట వ్యవధిలో ఆస్పత్రికి తీసుకువస్తే సుమారు రూ. 45 వేల విలువ చేసే స్టెమీ ఇంజిక్షన్ వేస్తామన్నారు. దీని వల్ల రోగి ప్రాణం కాపాడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కేవీఆర్ లే అవుట్‌లో చోరీ

విజయనగరం క్రైమ్: కోరుకొండ కేవీఆర్ లేఅవుట్‌లో చోరీ జరిగింది. ఈ మేరకు బాధితుని ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు సోమవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. రిటైర్డ్ ఎంఈఓ బి.రామారావు గత నెల 26న విజయవాడలో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లారు. అక్కడ నుంచి తిరిగి ఆదివారం ఇంటికి చేరుకున్నారు. అయితే ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న రెండు తులాల బంగారు ఆభరణాలు, అరకిలో వెండి వస్తువులు పోయినట్లు గుర్తించి, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై వి. అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండె జబ్బులపై అవగాహన ర్యాలీ



అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న సీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

భోగాపురం: మండలంలోని సుందరపేట కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో వైద్యాధికారులు వెంకటేష్, జె.సునీల్ ఆధ్వర్యంలో గుండె జబ్బులపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ.. గుండెపోటు వచ్చేటప్పుడు ముందుగా ఎడమవైపు ఛాతీలో నొప్పి అనిపించడం, భుజం లాగడం, గుండె దడ, నీరసంగా ఉండడం, శ్వాస ఆడకపోవడం, విపరీతమైన చెమటలు పట్టడం, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. అటువంటి వారిని వెంటనే దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి

• జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అచ్యుతకుమారి



విద్యార్థులకు సూచనలిస్తున్న డాక్టర్ అచ్యుతకుమారి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అచ్యుతకుమారి సూచించారు. మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత సమస్యను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు సాయిరాం, అనిల్‌కుమార్, ప్రిన్సిపాల్ పద్మలత, సిబ్బంది పాల్గొన్నారు.

సెంచూరియన్‌ను సందర్శించిన పారిశ్రామికవేత్తలు



సెంచూరియన్‌లో పరిశోధన యూనిట్‌ను తిలకిస్తున్న పారిశ్రామికవేత్తలు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వవిద్యాలయాన్ని ప్రముఖ పారిశ్రామికవేత్తలు వసుధ రామరాజు, శివప్రసాద్ రెడ్డి, నర్సింహరాజు, తదితరులు సోమవారం సందర్శించారు. వర్సిటీ ప్రతినిధులు జీఎస్ఎన్ రాజు, ప్రశాంతకుమార్‌తో కలిసి ప్రయోగశాలలు, పరిశోధన యూనిట్లను సందర్శించారు. విశ్వవిద్యాలయంలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. త్వరలో సెంచూరియన్‌లో ఏర్పాటు చేయనున్న వంద పడకల ఆస్పత్రికి తన వంతు సహకారం అందిస్తానని పారిశ్రామికవేత్త వసుధ రామరాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీన్లు సన్నీ డియోలు, విజయ్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్య వ్యక్తుల భద్రతలో అప్రమత్తం

• ఎస్పీ వకుల్ జిందల్



ప్రశంసాపత్రాలు అందుకున్న వారితో ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తూ ముఖ్య వ్యక్తుల భద్రత విధులు నిర్వహించే (పీఎస్ఓ) వారి వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపర్చేందుకు నిర్వహించిన రెండురోజుల శిక్షణ కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన పోలీసు సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందల్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించి, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్య వ్యక్తుల భద్రత విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇతర పోలీసు విధులు నిర్వహించడం కంటే ముఖ్య వ్యక్తుల భద్రత విధులు నిర్వహించడం విభిన్నమైందని, నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ భద్రత విధుల నిర్వహణను మరింత మెరుగు పరిచేందుకు రెండురోజుల పాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది శారీరక దారుఢ్యాన్ని మెరుగుపర్చడంతో పాటు ఫైరింగ్ ప్రాక్టీస్ కూడా చేపట్టామన్నారు. ఈ శిక్షణలోనూ, ఫైరింగ్‌లోనూ ప్రతిభ కనబర్చిన పోలీసు కానిస్టేబుళ్లు కె. త్రినాథరావు, ఎ.దుర్గా ప్రసాద్, వి.శ్రీనివాసరావు, ఎ.పైడిరాజు, షేక్ మెహరాజ్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసాపత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, ఆర్ఐ సెక్యూరిటీ టి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొప్పడాంలో ఎక్సైజ్ తనిఖీలు

సాక్షి ఎఫెక్ట్...

నెల్లిమర్ల రూరల్: మండలంలోని బొప్పడాం జంక్షన్‌లో ఎక్సైజ్ సీఐ వెంకటరావు సిబ్బందితో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. మద్యం విక్రయాలపై 'బొప్పడాంలో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు' అనే శీర్షికన సాక్షిలో సోమవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి ఎక్సైజ్ అధికారులు స్పందించి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మల్యాడ గ్రామానికి చెందిన జగన్మోహన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని, అతని వద్ద నుంచి పది మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెంకటరావు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల సంఘ వేడుకలు రేపు

విజయనగరం ఫోర్ట్: ఈ నెల 12న ఏపీ విద్యుత్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) ప్లాటినం జూబ్లీ వేడుకలు నిర్వహించనున్నట్లు సంఘం రీజనల్ కార్యదర్శి సురగాల లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణచక్రవర్తి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు ఈపీఎఫ్ పింఛన్‌దారుల ధర్నా

నెల్లిమర్ల: జిల్లా కేంద్రంలోని పీఎఫ్ కార్యాలయం వద్ద ఈపీఎఫ్ పింఛన్‌దారులు మంగళవారం ధర్నా నిర్వహించనున్నారని పింఛన్‌దారుల సంఘ మండల నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు తెలిపారు. సోమవారం స్థానిక అమర్‌భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ఈపీఎఫ్ పింఛన్‌దారులు సుమారు 79 లక్షల 49 వేల మంది ఉండగా.. వారి సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు చేయలేదన్నారు. కనీస పింఛన్ రూ. 9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్‌దారులందరూ పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకుడు కాళ్ళ అప్పలసూరి, తదితరులు పాల్గొన్నారు.

జొన్నాడ పైడితల్లి జాతర నేడు



పైడితల్లి

డెంకాడ: జొన్నాడ పైడితల్లి జాతర మహోత్సవం మంగళవారం జరగనుంది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. మండలంలోని జొన్నాడ, బొడ్డవలస, ఆకులపేట, డి.తాళ్లవలస, రఘుమండ, అమకాం, మోపాడ, గంట్లాం, చింతలవలస, తదితర గ్రామాల ప్రజలతో పాటు విజయనగరం మండలంలోని పలు గ్రామాలు, విశాఖ జిల్లా పద్మనాభ, భీమునిపట్నం మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారు.

పోలీస్ బందోబస్తు..

భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈమేరకు భోగాపురం సీఐ రామకృష్ణ జొన్నాడలో సోమవారం పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై ఎ. సన్యాసినాయుడు, పోలీసులు పాల్గొన్నారు.



బందోబస్తుపై అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న భోగాపురం సీఐ రామకృష్ణ, తదితరులు

ఉమా రామలింగేశ్వరుడి సన్నిధిలో జెడ్పీ చైర్మన్



ఉమారామలింగేశ్వర స్వామిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

భోగాపురం: మండలంలోని నందిగాంలో నూతనంగా నిర్మించిన ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలశాఖ అధ్యక్షుడు ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ గరే మురళీమోహనరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు గరే సంజీబు, గ్రామ పెద్దలు గరే వెంకటరమణ, అర్చకుడు సంతోష్‌కుమార్‌శర్మ, అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.